వరద ముప్పు లేకుండా పనులు చేపట్టాలి



రామరాజునగర్‌లో పర్యటిస్తున్న బీజేపీ నేత భరతసింహారెడ్డి

కుత్బుల్లాపూర్: వర్షాకాలంలో వరద ముప్పు లేకుండా పనులు చేపట్టేలా అధికారులతో మాట్లాడతానని బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా కార్యదర్శి భరతసింహారెడ్డి అన్నారు. జీడిమెట్ల డివిజన్ ప్రశాంత్‌నగర్, రామరాజునగర్‌లో నెల కొన్న డ్రైనేజీ సమస్య, సుచిత్ర నేషనల్ హైవేలో కొనసాగుతున్న అభివృద్ధి పనులతో నీరు వెనక్కి రావడంతో ఇబ్బందులు పడుతున్నామని కాలనీ వాసులు కార్పొరేటర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో ఆదివారం భరతసింహారెడ్డి సదరు కాలనీల్లో పర్యటించి సమస్యను పరిశీలించారు. జలమండలి, జీహెచ్ఎంసీ అధికారులతో ఫోన్‌లో మాట్లాడి భరతసింహారెడ్డి సమస్య తలెత్తకుండా తగు చర్యలు తీసుకోవాలని కోరారు.

- అనంతరం వెంకన్నహిల్స్‌లో నిర్మిస్తున్న నాలా బ్రిడ్జి పనులను పరిశీలించిన ఆయన వాల్‌ను సైతం ఏర్పాటు చేయాలని అధికారులను కోరారు. ఆయన వెంట కాలనీ అసోసియేషన్‌ల సభ్యులు, బీజేపీ నాయకులు ఉన్నారు. దత్తాత్రేయ నగర్‌లో శ్రీమల్లికార్జున స్వామి ఆలయ నవమ వార్షికోత్సవ మహోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న భరతసింహారెడ్డిస్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం



బాక్స్ క్రికెట్‌ను ప్రారంభిస్తున్న కౌన్సిలర్ నర్సారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి

దుండిగల్: క్రీడలు శారీరక దారుఢ్యంతో పాటు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని కౌన్సిలర్ నర్సారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బౌరంపేట ల్యాండ్ మార్క్-2 కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన క్రికెట్ బాక్స్‌ను ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. పిల్లలకు చిన్నతనం నుంచే చదువుతో పాటు క్రీడల పట్ల ఆసక్తి పెంచాలన్నారు. పాఠశాలల్లో సైతం తగిన సమయాన్ని కేటాయించాలన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ వైస్ ప్రెసిడెంట్ చంద్రశేఖర్‌రెడ్డి, కాలనీవాసులు పాల్గొన్నారు.

ప్రభుత్వం డ్రగ్స్, గంజాయిని నిర్మూలించాలి

డీవైఎఫ్‌ఐ రాష్ట్ర కార్యదర్శి అనగంటి వెంకటేష్



డ్రగ్స్, గంజాయి విక్రయాలను నిర్మూలించాలని నిరసన తెలుపుతున్న డీవైఎఫ్‌ఐ నాయకులు

బాలానగర్: భావితరాలకు మార్గదర్శకంగా ఉండాల్సిన నేటి యువత గంజాయి ఊబిలో చిక్కుకొని వారి జీవితాలను నాశనం చేసుకుంటున్నారని డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి అనగంటి వెంకటేష్ అన్నారు. కూకట్‌పల్లి సర్కిల్ బాలానగర్ డివిజన్ పరిధిలోని డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆదివారం సతీష్‌కుమార్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో రాష్ట్ర నాయకుడు అనగంటి వెంకటేష్, మేడ్చల్ జిల్లా నాయకుడు శ్రీకాంత్, మండల కార్యదర్శి చైతన్యరెడ్డి హాజరయ్యారు.

- ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శి వెంకటేష్ మాట్లాడుతూ... నేటి విద్యార్థులు, యువత గంజాయికి బానిసలుగా మారుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దేశ వ్యాప్తంగా ఆల్కహాల్ తరువాత ఎక్కువ మంది గంజాయికి వ్యసనపరులుగా మారుతున్నారని పేర్కొన్నారు. రాష్ట్రంలో గంజాయిని నిర్మూలించే విషయంలో ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరికలు జారీ చేసినా గంజాయి విక్రయదారులు రెచ్చిపోతున్నారన్నారు.
- ఇటీవలి కాలంలో గంజాయితో పట్టుబడ్డ నిందితుల్లో ఎక్కువగా విద్యార్థులు ఉండటం మరింత కలవరపాటుకు గురిచేస్తోందని అన్నారు. నేటి యువత మొదట మత్తు కోసం... తర్వాత డబ్బుల కోసం అడ్డదారులు తొక్కుతూ.. గంజాయి విక్రయిస్తూ వారి బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకుంటున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం మత్తు పదార్థాలను నిర్మూలించేందుకు ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసి చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు శ్రీమాన్, ఉపాధ్యక్షులు మల్లేష్, నరేష్, సహాయ కార్యదర్శులు వంశీ, అభి, రాజు, కోశాధికారి బన్నీ, కమిటీ సభ్యులు టైని, సాయిసాగర్, అనిల్, సాయికుమార్, మురళి, లక్ష్మణ్, రాజేందర్, రవికాంత్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తా



విద్యాకల్పన ఏకాంత్‌గౌడ్‌లను మర్యాదపూర్వకంగా కలిసిన ఎన్ఎస్‌యూఐ నాయకులు

ఆల్విన్‌కాలనీ: రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలిగా నియమితులైన ఉప్పల విద్యాకల్పన ఏకాంత్‌గౌడ్‌ను ఆదివారం ఎన్ఎస్‌యూఐ నాయకులు కలిశారు.శేరిలింగంపల్లి నియోజకవర్గ ఎన్ఎస్‌యూఐ ఉపాధ్యక్షులు దుర్గ ముదిరాజ్, వివేకానందనగర్ డివిజన్ అధ్యక్షుడు దుర్గ ప్రసాద్, నాయకులు వికాస్, శివ, సాయి, రోహిత్ ఆమెకు పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. అందుకు ఎన్ఎస్‌యూఐ నాయకుల సహకారం సైతం ఉండాలని కోరారు.

బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయొద్దు



గూడ్స్ షెడ్‌రోడ్డులో చెత్త వేసే ప్రాంతంలో 'చాయ్ పే చర్చ'లో మున్సిపల్ సిబ్బంది

మూసాపేట: మూసాపేట గూడ్స్‌షెడ్ రోడ్డులో స్థానికులు చెత్త పడవేసే ప్రాంతంలో మున్సిపల్ సిబ్బంది ఆదివారం చాయ్ పే చర్చ కార్యక్రమం నిర్వహించారు. జోనల్ కమిషనర్ అభిలాష అభినవ్ ఆదేశాల మేరకు సీనియర్ సిటిజన్స్, రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు పాల్గొనేలా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. జీవీపీ పాయింట్ల దగ్గర యూబీడీ వారి సహకారంతో మొక్కలు నాటాలన్నారు. అనంతరం ముగ్గులు వేసి సీనియర్ సిటిజన్లతో కలిసి చాయ్ తాగారు. స్థానికులు చెత్తను రోడ్లపై, కూడళ్ల ప్రాంతాల్లో వేయకుండా వారికి అవగాహన కోసం ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఇంటికి వచ్చే చెత్తను సేకరించే వాహనంలోనే చెత్తను అందించాలని అవగాహన కల్పిస్తున్నారు.

ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి



ఉచిత వైద్య శిబిరంలో పాల్గొన్న స్థానికులు

మూసాపేట: మూసాపేటలోని గూడ్స్ షెడ్ రోడ్డులోని రాయల్ ఫంక్షన్‌హాల్ వద్ద కాంగ్రెస్ నేత చున్ను పాషా ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో సుమారు 400 మందికి ఉచితంగా షుగర్, థైరాయిడ్, సాధారణ వైద్య పరీక్షలు చేశారు. అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మూసాపేట పరిసర ప్రాంతాల్లో ప్రతి వారానికి ఒక్కసారి వైద్య శిబిరం నిర్వహిస్తామన్నారు. ఆరోగ్యం పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు నిర్వహించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ మహ్మద్ ముస్సి, డాక్టర్ రజిత, ప్రవీణ్, శ్రీకాంత్, రాకేష్, సాయి, కాంగ్రెస్ పార్టీ నాయకులు తూము సచిన్‌కుమార్, టింకు, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

నిబంధనల్లో మార్పు..!

పురపాలికల్లో ఆస్తిపన్ను వసూళ్లకు ఇక నయా రూల్స్

- నగదు లావాదేవీల నిర్వహణ నుంచి అవుట్ సోర్సింగ్ సిబ్బంది ఔట్
- రెగ్యులర్ ఉద్యోగులకు బాధ్యతలు అప్పగించేందుకు అధికార యంత్రాంగం చర్యలు



సాక్షి,మేడ్చల్ జిల్లా: పురపాలికల్లో ఆస్తి పన్ను వసూళ్లలో ప్రభుత్వం మార్పులు చేసింది. నగదు లావాదేవీల నిర్వహణ నుంచి అవుట్ సోర్సింగ్ సిబ్బందిని తప్పించి పౌర సేవా కేంద్రంలో నేరుగా ఆస్తి పన్ను స్వీకరించి కంప్యూటరైజ్డ్ రసీదు ఇచ్చే విధానానికి స్వస్తి పలకాలని ఆదేశాలు జారీ చేసింది. రాష్ట్రంలోని పలు పురపాలిక (పట్టణాలు)ల్లో ఆస్తి పన్ను వసూళ్లలో అవకతవకలు జరిగినట్లు ప్రభుత్వం గుర్తించింది. దీన్ని అరికట్టేందుకు తాజాగా నూతన నిబంధనలను రూపొందించి అన్ని పురపాలికల్లో అమలు చేయాలని మున్సిపల్ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది.

జమ చేయడం లేదని..

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోని పలు పురపాలికల్లో సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ఆస్తి పన్ను వసూలు చేస్తున్నారు. తర్వాత సంఘం కార్యాలయంలోని సిటిజెన్ సర్వీస్ సెంటర్‌లో ఆస్తి పన్ను చెల్లించిన వారికి కంప్యూటరైజ్డ్ రసీదు అందజేస్తున్నారు. అయితే.. కొన్ని మున్సిపాలిటీల్లో అవుట్ సోర్సింగ్ సిబ్బంది వసూలైన ఆస్తి పన్ను డబ్బులను సకాలంలో క్యాష్ కౌంటర్‌లో జమ చేయడం లేదన్న ఫిర్యాదులు ప్రభుత్వం దృష్టికి వెళ్లాయి. దీంతో సిటిజెన్ సర్వీస్ సెంటర్‌లో పన్నులు స్వీకరించవద్దని మున్సిపల్ శాఖ ఆదేశాలు జారీ చేసింది. అక్కడ ప్రత్యేకంగా రెగ్యులర్ ఉద్యోగిని నియమించి చేతి యంత్రంతో పన్ను వసూళ్లు స్వీకరించేలా చర్యలు తీసుకుంటున్నారు.

రెగ్యులర్ ఉద్యోగులకే బాధ్యతలు..

పురపాలికల్లో ఏటా ఆస్తి పన్ను వసూళ్లను సిబ్బంది చేతి యంత్రాలు (హ్యాండ్ హెల్త్ మెషీన్) లో పీటీఐఎన్ (ప్రాపర్టీ ట్యాక్స్ ఐడెంటిఫికేషన్ నెంబర్) నమోదు చేసి ఎంత పన్ను ఉందో చెప్పి డబ్బులు వసూలు చేసి రసీదు అందజేస్తారు. సేకరించిన డబ్బులను పురపాలికల్లోని క్యాష్ కౌంటర్‌లో జమ చేస్తారు. పన్ను వసూళ్లకు చాలా చోట్ల అవుట్ సోర్సింగ్ సిబ్బంది పని చేస్తున్నారు. వాస్తవానికి చేతి యంత్రాలు రెగ్యులర్ ఉద్యోగుల పేరిటే ఉన్నా.. ఉద్యోగుల కొరత కారణంగా అవుట్ సోర్సింగ్ సిబ్బంది ఆస్తి పన్ను వసూళ్లు చేపడుతున్నారు. అయితే వారు ఏదైనా అవకతవకలకు పాల్పడితే వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకునే అవకాశం లేదు. దీంతో వారిని ఈ విభాగం నుంచి తప్పించి రెగ్యులర్ ఉద్యోగులే నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని పురపాలక శాఖ ఉన్నతాధికారులు సూచిస్తున్నారు. అయితే మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోని 13 పురపాలికల్లో రెగ్యులర్ ఉద్యోగుల కొరత తీవ్రంగా ఉంది. అవుట్ సోర్సింగ్ సిబ్బందిని మినహాయిస్తే.. పన్ను వసూళ్లపై ప్రభావం పడుతుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

అమలుకు సన్నద్ధం..

పురపాలికల్లో ఆస్తి పన్ను వసూళ్లలో రాష్ట్ర మున్సిపల్ శాఖ సూచించిన నిబంధనలు అమలు చేసేందుకు సంబంధిత అధికారులు సిద్ధమవుతున్నారు. రాష్ట్రంలోని పలు మున్సిపాలిటీల్లో ఆస్తి పన్ను వసూళ్లలో అవకతవకలు జరిగిన కారణంగా పురపాలక శాఖ ఈ నిర్ణయం తీసుకుందని పేర్కొంటున్న పురపాలక అధికార యంత్రాంగం ఈ మేరకు అవుట్ సోర్సింగ్ సిబ్బందితో నగదు లావాదేవీల నిర్వహణ విధులకు దూరంగా ఉండేలా చర్యలు తీసుకుంటోంది.

శిల్పారామంలో అలరించిన సంగీత విభావరి

మాదాపూర్: కళాకారులు అన్నమాచార్య కీర్తనలు, రామదాసు కీర్తనలతో సందర్శకులను అలరించారు. మాదాపూర్‌లోని శిల్పారామంలో నిర్వహిస్తున్న వారాంతపు కార్యక్రమాలలో భాగంగా ఆదివారం సప్తస్వర అకాడమీ ఆఫ్ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ ఆధ్వర్యంలో సంగీత నృత్య విభావరి కార్యక్రమాన్ని నిర్వహించారు. పాహి పాహి, రామ రామ, మారుతీ మారుతీ, గేమ్ గేమ్ గణపతి తదితర భజనలను, అన్నమాచార్య కీర్తనలు, రామదాసు కీర్తనలు ఆలపించి అలరించారు. కళాకారులు నిత్యకమలాశ్రీ నందు, ఆముక్త, శ్రీహిత, శ్రీనిక, యువన్, యాషిక, శ్రీవిద్య, కార్తీక్, పూజిత, వేదశ్రీ, గౌరీ తదితరులు పాల్గొని ఆలపించారు. వినాయకకౌతం, రామాయణశబ్దం, ఆధ్యాత్మ రామాయణ కీర్తన తదితర అంశాలను శ్రీనిధి, మహతి, మైథిల్యా ప్రదర్శించి అలరించారు.

తైక్వాండోలో సత్తాచాటిన విద్యార్థులు



విద్యార్థులను సత్కరిస్తున్న దూలపల్లి బజరంగ్‌దళ్ సభ్యులు

సుభాష్‌నగర్: దూలపల్లికి చెందిన బేర్‌ఫుట్ తైక్వాండో అకాడమీ విద్యార్థులు ఇటీవల గోవాలో జరిగిన జాతీయస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచారు. ఆదివారం దూలపల్లికి చెందిన బజరంగ్ దళ్ సభ్యుల ఆధ్వర్యంలో విద్యార్థులను సత్కరించి ప్రోత్సాహక బహుమతులు అందజేశారు.

డాక్టరేట్ ప్రదానం

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ ఇంగ్లిష్ విభాగం నుంచి సురగాని హిమబిందు పీహెచ్‌డీ డాక్టరేట్ డిగ్రీ సాధించింది. సీనియర్ అధ్యాపకురాలు ప్రొ.కేఎం ప్రవీణ పర్యవేక్షణలో క్విస్ట్ ఫర్ ఐడెంటిటీ ఇన్ ద ట్రాన్స్‌లేటెడ్ వర్క్స్ ఆఫ్ మహాశ్వేత దేవి, ఊర్మిళ పవార్, అరుపకలిత పతంజాలి అనే అంశంపై చేసిన పరిశోధనకు డాక్టరేట్ లభించింది. కామారెడ్డిలో ప్రభుత్వ గురుకుల డిగ్రీ కాలేజీలో ఇంగ్లిష్ అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్న హిమబిందును పలువురు అభినందించారు.

రోడ్లపై మట్టి, ఇసుక మేటలు

వాహనదారులకు ఇబ్బందులు



గాంధీనగర్-నందానగర్ ప్రధాన రోడ్డులో ఇసుకను తొలగిస్తున్న పారిశుద్ధ్య సిబ్బంది

రంగారెడ్డినగర్: ఇటీవల కురిసిన వర్షాలతో రోడ్లపై మట్టి, ఇసుక మేటలు వేయడంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో జీహెచ్ఎంసీ పారిశుద్ధ్య విభాగం అధికారులు చర్యలు చేపట్టారు. ఆదివారం గాంధీనగర్ - నందానగర్ పారిశ్రామికవాడ ప్రధాన రోడ్డులో పేరుకుపోయిన ఇసుకను సిబ్బంది తొలగించారు. దీంతో వాహనదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

తీన్‌మార్ మల్లన్నకు మాలల మద్దతు

ఉస్మానియా యూనివర్సిటీ: నేడు జరిగే (27న) పట్టభద్రుల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తీన్‌మార్ మల్లన్నకు తెలంగాణ మాల స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు చినేని వెంకట్ ఆదివారం మద్దతు ప్రకటించారు. తీన్‌మార్ మల్లన్నకు మొదటి ప్రాధాన్యత ఓటును వేయాలని కోరారు. గత ఎన్నికల్లో ఎస్సీ డిక్లరేషన్ ప్రకటించిన కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డిని కోరారు. పాలన పదవుల్లో సామాజిక న్యాయాన్ని పాటిస్తున్న సీఎంకు మాలల మద్దతు ఎప్పుడు ఉంటుందన్నారు.

టీఎన్‌జీఓకాలనీలో సమస్యలు పరిష్కరించాలి

ఎమ్మెల్యే గాంధీకి వినతిపత్రం అందించిన కాలనీవాసులు



రాయదుర్గం: గచ్చిబౌలి డివిజన్ టీఎన్‌జీఓకాలనీలో సమస్యలు పరిష్కరించాలని, త్వరితగతిన అభివృద్ధి పనులు చేపట్టాలని కాలనీవాసులు శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడిగాంధీకి వినతి పత్రాన్ని అందించారు. ఆదివారం ఆయన నివాసంలో కాలనీవాసులు కలిసి తమ సమస్యలను ఆయన దృష్టికి తీసుకొచ్చారు. కాలనీలో పలు సమస్యలు నెలకొన్నాయని, అసంపూర్తిగా మిగిలి పోయిన సీసీరోడ్లను వేయాలని, కరెంట్ అంతరాయంపై చర్యలు తీసుకోవాలని, వీధి దీపాలను ఏర్పాటు చేసేలా చూడాలని వారు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ టీఎన్‌జీఓకాలనీని ఆదర్శంగా తీర్చిదిద్దుతామన్నారు. కాలనీలో నెలకొన్న పలు సమస్య లను త్వరితగతిన పరిష్కరించేందుకు దశలవారీగా అన్ని అభివృద్ధి పనులు చేపట్టేలా చేస్తామన్నారు. తాగునీటిని కుళాయిల ద్వారా ఎక్కువ ప్రెజర్‌తో విడుదల చేసేలా చూస్తామన్నారు. ప్రజలకు ఎలాంటి ఇక్కట్లు లేకుండా నీరు వదలడం జరుగుతుందన్నారు. అసంపూర్తిగా మిగిలిన సీసీరోడ్లను పూర్తి చేసేలా చూస్తామని హామీ ఇచ్చారు. విద్యుత్ సమస్యపై సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి వెంటనే పరిష్కరించేలా చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకుడు సత్యనారాయణ, టీఎన్‌జీఓకాలనీ వాసులు సుధాకర్, సంజీవయ్య, సైదిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

జూన్ 9న ప్రతిభా పురస్కారాల ప్రదానం

పంజగుట్ట: రాష్ట్ర వీరశైవ లింగాయత్ లింగ బలిజ సంఘం రాష్ట్ర యువజన విభాగం ఆధ్వర్యంలో జూన్ 9వ తేదీన బిర్లా ఆడిటోరియంలో 10వ తరగతి ప్రతిభా పురస్కారాల ప్రదానోత్సవాన్ని నిర్వహించనున్నట్లు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పట్లోళ్ల సంగమేశ్వర్ తెలిపారు. తమ కులంలోని విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలో చదివి 10 జీపీఏ నుంచి 9 జీపీఏ వరకు వచ్చిన వారికి, ప్రైవేట్ పాఠశాలల్లో 10 జీపీఏ నుండి 9.2 జీపీఏ వచ్చిన విద్యార్థులందరికీ ప్రతిభా పురస్కారాలతో సన్మానించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఆదివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... గత 10 సంవత్సరాలుగా తమ యువజన విభాగం ఆధ్వర్యంలో ప్రతిభా పురస్కారాల కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

'నాది స్వప్నం కాదు సమరం' ఆవిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

పంజగుట్ట: యువ కవి ఇంద్రపాల శ్రీనివాస్ నిర్భయ కవి అని, అతని వాక్య నిర్మాణమే అత్యంత శక్తివంతమైనదని పలువురు వక్తలు అన్నారు. ఆదివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో రచయిత ఇంద్రపాల శ్రీనివాస్ రచించిన కవితా సంపుటి 'నాది స్వప్నం కాదు సమరం' పుస్తకాన్ని అతని చిన్ననాటి తెలుగు ఉపాధ్యాయుడు వి.కృష్ణయ్య ఆవిష్కరించారు. కార్యక్రమానికి ప్రముఖ దిగంబర కవి నగ్నముని, కవులు దెంచనాల, మునాసు వెంకట్, ఏనుగు నరసింహారెడ్డి, అంబటి సురేంద్ర రాజు, రమణ జీవి, తాడి ప్రకాష్, ప్రముఖ విమర్శకులు సామిడి జగన్ రెడ్డి హాజరయ్యారు.

ట్రామా కేర్‌లో నిమ్స్ ప్రత్యేకం

లక్డీకాపూల్: అత్యవసర వైద్య సేవల్లో నిమ్స్ ప్రత్యేకమని డైరెక్టర్ ప్రొఫెసర్ నగరి బీరప్ప పేర్కొన్నారు. ట్రామా, క్రిటికల్ కేర్‌పై నైపుణ్యాన్ని మరింత పెంపొందించేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఆదివా రం నిమ్స్ ట్రామా ఐదవ అంతస్తు ఆడిటోరియంలో ప్రపంచ అత్యవసర వైద్య దినోత్సవాన్ని పురస్కరించుకుని సీపీడీ కార్యక్రమం జరిగింది. అంతర్జాతీయ ట్రామా అండ్ క్రిటికల్ కేర్ సొసైటీ (ఐటీఏసీసీఎస్) సహకారంతో ఎమర్జెన్సీ విభాగాధిపతి డాక్టర్ అష్మా శర్మ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమాన్ని ప్రారంభించిన డైరెక్టర్ బీరప్ప మాట్లాడుతూ... ఎమర్జెన్సీ మెడిసిన్‌లో స్పెషాలిటీ సేవలను మరింత విస్తరింపచేయాలన్నారు. నిమ్స్ ఎమర్జెన్సీ విభాగాధిపతి ప్రొఫెసర్ అష్మా శర్మ, డిప్యూటీ మెడికల్ సూపరిడెంట్ డాక్టర్ లక్ష్మి భాస్కర్, ఎమర్జెన్సీ సీనియర్ వైద్యులు ముబాశీర్ సోహైల్ పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



జీడిమెట్ల: గుర్తు తెలియని వ్యక్తి మతదేహం లభించిన సంఘటన జీడిమెట్ల పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం చింతల్ ప్రధాన రోడ్డులోని కేఎఫ్‌సీ ముందు ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం ఉందని పోలీసులకు సమాచారం అందింది. అక్కడకు చేరుకున్న పోలీసులు మృతదేహానికి పంచనామా నిర్వహించి ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో గుర్తు తెలియని వ్యక్తిగా కేసు నమోదు చేశారు. అనంతరం మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు. మృతుడి వయస్సు 55 సంవత్సరాల వరకు ఉంటుందన్నారు. మృతుడి సంబంధికులు ఎవరైనా ఉంటే జీడిమెట్ల పీఎస్‌లో సంప్రదించాలని పోలీసులు కోరారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

నిజాంపేట్: విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలు, లైన్ల నిర్వహణ నేపథ్యంలో సోమవారం విద్యుత్ సరఫరాలో ఆటంకాలు తలెత్తనున్నాయని బాచుపల్లి ఏఈ శాంతకుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. మా విల్లాస్ పరిధిలో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు మమత ఆస్పత్రి, దేవీ హోమ్స్, బొల్లారం ఇండస్ట్రీ ఏరియా, ప్రణీత్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 1.30 గంటల నుంచి 3 గంటల వరకు ప్రణీత్ ఎంటిల్లాలో, బీవీఆర్‌ఐటీ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 3.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు బీవీఆర్‌ఐటీ కళాశాల, సత్యం వ్యాలీ, పూజిత లేఅవుట్, సత్యం హైట్స్, విస్పర్ వ్యాలీ, జయదీపిక ప్రాంతాల్లో, శ్రీహోమ్స్ ఫీడర్ పరిధిలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు క్రాంతినగర్ కాలనీ, శ్రీహోమ్స్ ప్రాంతాల్లో సరఫరా ఉండదని ఏఈ పేర్కొన్నారు.

నిజాంపేట్ సెక్షన్ పరిధిలో..

- శ్రీనివాస ఫీడర్ పరిధిలో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు శ్రీనివాసకాలనీ, కేటీఆర్ కాలనీ, రాజధాని స్కూల్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 1.30 గంటల నుంచి 3 గంటల వరకు రెడ్డి ఎవెన్యూ, పాత గ్రామ పంచాయతి ఏరియా, అధిత్య లాగూన్, వెంకటసాయి ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 3.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు వెంకటసాయి ఎన్‌క్లేవ్, బాటా షోరూమ్ వెనుక గల్లీ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని నిజాంపేట్ ఏఈ పేర్కొన్నారు.

ప్రగతినగర్ సెక్షన్ పరిధిలో..

- డాక్టర్ కాలనీ ఫీడర్ పరిధిలో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు, ప్రగతినగర్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు చర్చి ఏరియా, మున్సిపల్ కార్యాలయం ప్రాంతం, జూడో మాల్ ఏరియా, తిరుమల ఫర్నీచర్, ప్రగతిసెంట్రల్ స్కూల్, అపురూప కాలనీ, శ్రీమంకీ చౌరస్తా ప్రాంతాల్లో సరఫరా ఉండదని ప్రగతినగర్ ఏఈ సమ్మయ్య తెలిపారు.

కొంపల్లి సబ్‌స్టేషన్ పరిధిలో...

- కుత్బుల్లాపూర్: కొంపల్లి సబ్‌స్టేషన్ పరిధిలో చెట్ల కొమ్మల తొలగింపు, ఫీడర్‌లైన్ల నిర్వహణ నేపథ్యంలో సోమవారం విద్యుత్ సరఫరాలో ఆటంకాలు తలెత్తనున్నాయని కొంపల్లి ఏఈ ఓ ప్రకటనలో తెలిపారు.
- అపర్ణ ఫీడర్ పరిధిలో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు అపర్ణ పామ్‌గ్రోవ్, వెంకటేశ్వర కాలనీ, దేవేందర్ కాలనీ, మికాసా స్టెర్లింగ్, అమర్ రోడ్డు, సెంట్రల్ పార్క్ ఏరియా,
- స్టీల్ సిటీ ఫీడర్ పరిధిలో 11 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు దూలపల్లి ఇండస్ట్రీ ప్రాంతం,
- దూలపల్లి ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు దూలపల్లి విలేజ్, అకోకా ఐలా మైసస్ ఫేజ్-1, సెయింట్ మార్టిన్స్ కళాశాల,
- గార్డెన్ సొసైటీ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు గార్డెన్ సొసైటీలో విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

క్రషర్ ఫీడర్ పరిధిలో..

- **సుభాష్‌నగర్:** విద్యుత్ ఫీడర్ల నిర్వహణ, చెట్ల కొమ్మల తొలగింపు నేపథ్యంలో సోమవారం విద్యుత్ సరఫరాలో ఆటంకాలు ఏర్పడనున్నాయని గాజులరామారం ఏఈ చైతన్యభార్గవ్ ఓ ప్రకటనలో తెలిపారు. క్రషర్ ఫీడర్ పరిధిలో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు గాజులరామారం గ్రామం, నర్సింహ బస్తీ, దేవేందర్‌నగర్, ఆర్‌పీఎస్‌ఆర్ నగర్, బతుకమ్మబండ, వీనస్ రాక్ హైట్స్, కైసర్‌నగర్, లాల్‌సాబ్‌గూడ, ఏరో నగర్, పోచమ్మబస్తీ, ఒక్షిత్ హిల్‌వ్యూ, జేఎన్ఎన్‌యూఆర్ఎం తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ తెలిపారు.

బహదూర్‌పల్లి సబ్‌స్టేషన్ పరిధిలో...

దుండిగల్: బహదూర్‌పల్లి సబ్‌స్టేషన్ పరిధిలోని లక్ష్మీనగర్ ఫీడర్ మరమ్మత్తుల కారణంగా సోమవారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ సాయికిరణ్ తెలిపారు. లక్ష్మీనగర్, కృష్ణానగర్, సూరారం గ్రామం, అయ్యప్ప సొసైటీ, విశ్వకర్మ కాలనీ తదితర ప్రాంతాల్లో సరఫరా ఉండదన్నారు.

భగత్‌సింగ్‌నగర్, గాంధీనగర్ ఫీడర్ల పరిధిలో..

- **జగద్గిరిగుట్ట:** విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు నేపథ్యంలో సోమవారం విద్యుత్ సరఫరాలో అవాంతరాలు ఏర్పడనున్నాయని జగద్గిరిగుట్ట ఏఈ రాధాకిషన్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. భగత్‌సింగ్‌నగర్ ఫీడర్ పరిధిలో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు భగత్‌సింగ్‌నగర్, చంద్రానగర్, దుర్గానగర్, స్వార్తినగర్, చింతల్, శివనగర్, గాంధీనగర్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 1.30 గంటల నుంచి 3 గంటల వరకు చింతల్, రంగానగర్, చంద్రానగర్-2, సాయి కాలనీ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ తెలిపారు.

కులగణన తర్వాతే 'స్థానిక' ఎన్నికలు నిర్వహించాలి

పంజగుట్ట: తెలంగాణ ఉద్యమంలో ఏవిధంగా అయితే అన్ని వర్గాలు ఐక్యమై పోరాడామో బీసీ హక్కుల సాధన కోసం యావత్ బీసీ సమాజం ఐక్యంగా పోరాడాలని రిటైర్డ్ ఐఏఎస్ అధికారి టి.చిరంజీవులు పిలుపునిచ్చారు. ఆదివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో బీసీ సమాజ్, బీసీ టైమ్స్ ఆధ్వర్యంలో బీసీ కుల బాంధవుల ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. బీసీ సమాజ్ వ్యవస్థాపకులు సంగెం సూర్యారావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన చిరంజీవులు మాట్లాడుతూ... భవిష్యత్‌తో బీసీలు అందరూ ఏకమై రాజ్యాధికారం దిశగా ముందుకు అడుగులు వెయ్యకపోతే భవిష్యత్ ప్రశ్నార్థకారంగా మారే పరిస్థితి ఉందన్నారు. సంగెం సూర్యారావు మాట్లాడుతూ... కుల గణన చెయ్యకుండా స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్తే ప్రభుత్వానికి వ్యతిరేకంగా అన్ని కుల సంఘాల నాయకులు, బీసీ సంఘాల నాయకులను ఐక్యం చేసి రాష్ట్ర వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేస్తామని హెచ్చరించారు.

వివాదాస్పద స్థలంలో ఇరువర్గాల ఘర్షణ

అమీర్‌పేట కార్పొరేటర్ సరళ.. మరో వ్యక్తి మధ్య వివాదం

శ్రీనగర్‌కాలనీ: సారథి నగర్ సొసైటీలోని సర్వే నెంబర్ 128 స్థలం వివాదంగా మారింది. నాదంటే నాదంటూ ఇరువర్గాలు ఘర్షణకు దిగటంతో బోరబండ పోలీసులు, ఖైరతాబాద్ రెవెన్యూ సిబ్బంది రంగంలోకి దిగి సమస్య సద్దుమణిగేలా చేశారు. వివరాలివీ... ఎర్రగడ్డ డివిజన్‌లోని సారథి నగర్ సొసైటీ సర్వే నెం128లోని ప్లాట్స్‌లో స్థలం ఉంది. ఇటీవలే ఓ వ్యక్తి పిల్లర్ నిర్మాణం చేపడుతుండగా పోలీసులు, రెవెన్యూ సిబ్బంది అడ్డుకున్నారు. ఆదివారం అమీర్‌పేట కార్పొరేటర్ సరళ ఆ స్థలం తమదే అంటూ తన అనుచరులతో కలిసి వివాదాస్పద స్థలం వద్దకు చేరుకుంది. అక్కడే ఉన్న మరోవర్గం ఆ స్థలం తమదేనంటూ సరళతో వాగ్వాదానికి దిగారు. దీంతో కొద్దిసేపు ఉద్రిక్తత చోటుచేసుకుంది. ఎస్‌ఆర్‌నగర్ ఏసీపీ వెంకటరమణ, డీఐ భూపాల్‌గౌడ్, ఎస్ఐ నాగూల్ మీరా పోలీసులు సిబ్బంది ఇరువర్గాలను నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలోనే కార్పొరేటర్ సరళ అనుచరులు, బీజేపీ నేతలు, మరోవర్గం తోపులాటకు దిగారు. బీజేపీ నాయకుల ఫిర్యాదు మేరకు అదుపులోకి తీసుకున్నారు. సంబంధిత ప్రతాలను రెవెన్యూ కార్యాలయంలో సమర్పించాలని రెవెన్యూ అధికారులు సూచించారు.